11092024-DIS-04_Layout 1 9/11/2024 3:46 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఫిరాయింపులపై కీలక తీర్పు

మొన్నటి ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై రాష్ట్ర హైకోర్టు అత్యంత కీలకమైన ఆదేశాలు జారీచేసింది. బీఆర్ఎస్ నేతలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీ విజయ సేన్ రెడ్డి ధర్మాసనం జారీచేసిన ఈ ఆదేశాలు సుదీర్ఘ పర్యవసానాలను కలిగి ఉంటాయనడంలో సందేహం లేదు. రాష్ట్ర రాజకీయాలను ఇది ప్రభావితం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే 'ఫిరాయింపులపై మీరు తేలుస్తారా లేక మేమే తేల్చాలా?' అనే ప్రశ్నను శాసనవ్యవస్థ సర్వోన్నత అధికారి అయిన సభాపతికి న్యాయస్థానం సంధించింది. పార్టీ ఫిరాయింపులపై సహేతుకమైన గడువులో నిర్ణయం తీసుకోవడమనేది న్యాయసమీక్షకు లోబడే ఉంటుందని స్పష్టం చేయడం మరో ముఖ్యాంశం. అందుకు అనుగుణంగానే నాలుగు వారాల గడువును కూడా విధించింది. అంటే స్పీకర్ తన విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లో ఖరారు చేయాలని సారాంశం. ఇక ఏ మాత్రం జాప్యానికి ఆస్కారం ఉండ కూడదన్న ధోరణి కోర్టు ఆదేశాల్లో వ్యక్తమైంది.

ఇక్కడ మనకు హైకోర్టు సూచించిన క్రమంలో నాలుగు అంశాలు ప్రధానమైనవిగా కనిపిస్తున్నాయి. ఒకటి, ఫిరాయింపు పిటిషన్ ఫైళ్లను అసెంబ్లీ కార్యదర్శి తక్షణం స్పీకర్ ముందుంచాలని ఆదేశించడం. రెండు, విచారణ షెడ్యూల్ రూపొందించాలని చెప్పడం. మూడు, సదరు వివరాల నివేదికను రిజిస్ట్రార్‌కు నివేదించాలనడం. నాలుగు, ఇదంతా గడువులోగా జరగకపోతే సుమోటోగా విచారణ జరిపి తీర్పునిస్తామని తేల్చిచెప్పడం. నిర్ణీత సమయంలోగా నిర్ణయం జరగాలన్న పిటిషనర్ల వాదనను కాదనలేమని కోర్టు అభిప్రాయపడింది. చట్టసభ గడువు ఐదేండ్లు కనుక సభాకాలం ముగిసేదాకా స్పీకర్ మౌనంగా ఉంటానంటే కోర్టులు చేతులు కట్టుకొని కూర్చోవని స్పష్టం చేయడం విశేషం. అలాగని సాంకేతిక కారణాలు చెప్పి పిటిషన్‌ను కొట్టివేయడం వల్ల న్యాయం చేసినట్టు కాదని నొక్కిచెప్పింది.

హైకోర్టు ధర్మాసనం తన నిర్ణయాలకు ఆలంబనగా రెండు సుప్రీం కోర్టు తీర్పులను ప్రస్తావించడం గమనార్హం. అందులో మొదటిది నాగాలాండ్‌కు చెందిన కిహోటో హోలోహాన్ కేసులో ఫిరాయింపుల నిరోధక చట్టం రాజ్యాంగ బద్ధతను, స్పీకర్ సర్వాధికృతను సమర్థిస్తూ ఇచ్చినది. కాగా, రెండోది మణిపూర్‌కు చెందిన కీశం మేఘచంద్రసింగ్ కేసులో ఇచ్చిన మూడు నెలల గడువుకు సంబంధించినది. దేశంలోని కోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం తీర్పులు శిరోధార్యాలుగా ఉంటాయి. రాజ్యాంగం *141* అధికరణం ప్రకారం అవి చట్టాలుగా పరిగణించబడతాయని హైకోర్టు ధర్మాసనం గుర్తుచేసింది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ ప్రమాణాలు, నైతికతలకు ప్రతి రాజ్యాంగ వ్యవస్థ కట్టుబడి ఉండాలని, కాలయాపన వల్ల న్యాయం దక్కని పరిస్థితులు ఉండకూడదని చెప్పడం గమనార్హం. ఈ తీర్పుపై శాసన, పరిపాలనా వ్యవస్థల ప్రతిస్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

ఎన్నాళ్లీ మాఫీ సాగదీత?

ఉమ్మడి పాలనలో పంటలు ఎండిపోయి, అప్పులపాలై అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటే, ఇప్పుడు తెలంగాణ గడ్డపై అప్పు మాఫీ కాలేదని రైతు ఉరి వేసుకొని ప్రాణం తీసుకున్నాడు. రైతుల్లో పంట రుణమాఫీ ఆశలు రేపిన ప్రస్తుత ప్రభుత్వం ఒక అమాయకుడి చావుకు కారణమైంది. రుణమాఫీ వైఫల్యానికి ఈ మరణం తాజా తార్కాణం. రైతు తన సూసైడ్ నోట్‌లో 'బ్యాంకులో రుణమాఫీ కానందుకు ఆత్మహత్య' అని స్పష్టంగా రాశాడు.

బిన్నర్సన్
94401 28169

తల్లి కొడుకులు విడివిడిగా బ్యాంకు అప్పు తీసుకున్నారు. ఒకే రేషన్ కార్డులో ఇద్దరి పేర్లున్నా ఏ ఒక్కరికి రుణమాఫీ కాలేదు. తన రేషన్ కార్డులో తల్లి పేరు ఉన్నందువల్లే తనకు మాఫీ లభించలేదని ఆయన బాధపడ్డాడు. ఇక వచ్చే అవకాశం లేదని తీవ్ర నిర్ణయాన్ని తీసుకున్నాడు. ఈ ఆత్మహతి పట్ల ప్రభుత్వం కనీసం సానుభూతి ప్రకటించిన దాఖలాల్లేవు.

గత లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 15 నాటికి ఒకే విడతగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఏప్రిల్ 15 నాడు ప్రకటించారు. అదే గనుక జరిగితే 'తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తిరిగి పోటీలో నిలబడను' అని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు సవాల్ విసిరారు. దాంతో రుణమాఫీ ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకమైంది. నిజానికి హరీష్‌రావు ఈ మాట అని ఉండకపోతే 'రైతు భరోసా' లాగే రుణమాఫీ పట్ల కూడా వాయిదాల పర్వమే కొనసాగేది. మొత్తానికి ఏదో ఒత్తిడి కారణంగా రుణమాఫీ తెరపైకి వచ్చింది. బ్యాంకుల నిర్వహణా కార్యాలయాల నుంచి పంట రుణ బకాయిల లెక్కలు తీసుకున్నారు. రైతులు బ్యాంకులకు చెల్లించవలసింది రూ.41 వేల కోట్లు అని చెప్పారు. అంతకాదు రూ.39 వేల కోట్లేనని సర్ది చెప్పారు. చివరికి రూ.31 వేల కోట్ల మీద నిలబడ్డారు. జూలై 19 నాడు మొదలైన మాఫీ సొమ్ము విడుదల మూడు విడతలుగా ఆగస్టు 15 నాటికి పూర్తయింది. ప్రతిసారి '32.5 లక్షల రైతులకు రూ.31వేల కోట్ల రుణ మాఫీ' అని ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. ఇప్పటివరకు విడుదల చేసిన సొమ్ము మాత్రం రూ.18 వేల కోట్లు మాత్రమే. అంటే ఇంకా 40 శాతం సొమ్ము పంచవలసే ఉన్నది. రూ.2 లక్షలపైన ఉన్న బకాయిని రైతు స్వయంగా చెల్లించిన తర్వాతే మాఫీ సొమ్ము ఖాతాలో జమవుతుందనే మెలిక ఎందుకో అర్థం కాదు. వ్యవసాయమంత్రి ఎప్పుడు మాట్లాడినా 22 లక్షల మందికి ఒకే విడతలో రూ.18 వేల కోట్లు జమ చేశాం. అయితే వివిధ కారణాల వల్ల కొందరి రైతుల ఖాతాల్లోకి జమ కాలేదు. సక్రమంగా వారి ఖాతాల్లోకి బదలాయించేలా చర్యలు చేపట్టామని చెప్తున్నారు. రైతులు ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేదు, ఉద్యోగులే ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తారని అంటున్నారు. కుటుంబ నిర్ధారణ కాని ప్రతి ఒక్కరి నుంచి సమాచారం తీసుకొని, వాటిని సరిదిద్దేలా చూస్తున్నాం. ఇప్పటికి 2.65 లక్షల మంది వివరాలు సేకరించామన్నారు. ఈ తతంగమంతా ఎప్పుడు పూర్తవుతుందో, సర్కార్ ఇవ్వాలనుకున్న రైతులకైనా లాభం కలుగుతుందో లేదో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. ఎటుతిరిగి రూ.18 వేల కోట్ల గురించి తప్ప మంత్రిగారు మరో మాట ఎత్తడం లేదు. రూ.31 వేల కోట్లలో మిగిలిన రూ.13 కోట్లు ఎప్పుడు, ఎవరి ఖాతాల్లో వేస్తారో చెప్పడం లేదు.

రుణమాఫీ రూ.31 వేల కోట్లు చేశామని ఎందుకు ప్రచారం చేసుకుంటున్నారో స్పష్టత లేదు. బ్యాంకులు ఇచ్చిన వివరాల ప్రకారం అంత మొత్తం అవసరమవుతుందని చెప్పిన ప్రభుత్వం ఆ వివరాలను దాచిపెడుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీల ప్రకారం బ్యాంకులు అందించిన రైతుల పేర్లు, వారి బకాయిలు ప్రభుత్వం బయటపెట్టాలి. అప్పుడే న్యాయంగా రుణమాఫీ రావలసిన రైతుల వివరాలు తెలుస్తాయి. బ్యాంకుల వారీగా ఆ సొమ్మును విడుదల చేస్తే రైతు ఖాతాల్లో జమవుతాయి. కుటుంబానికి ఒకరికే, రేషన్ కార్డులో ఒక పేరుకే, పింఛన్ వస్తే కట్, రేషన్ కార్డులో ఉద్యోగి ఉంటే 'నో' అనే దాపరికపు అడ్డంకుల వల్లే ఈ సమస్యలన్నీ వచ్చాయి. విడుదల చేసిన సొమ్ములో కూడా వందల కోట్లు రైతుల ఖాతాల్లోకి చేరడం లేదు. ఎంత మిగిలితే అంత లాభం అన్నట్లుగా రోజుకో పిట్టకథ చెప్తూ ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నది. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే రూ.18 వేల కోట్లు కూడా రైతులకు దక్కేట్లు లేదు.

రుణమాఫీ 60 శాతం మాత్రమే అయింది. అందరికీ అందేలా రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీజేపీ బాధితుల కోసం ఒక ఫోన్ నంబర్ ప్రకటించింది. చాలా కాల్స్ వచ్చాయన్నారు. ఆందోళనకు దిగుతామని కూడా అన్నారు. ఇంతవరకు దాని ఊసు లేదు. కమ్యూనిస్టు పార్టీలు కూడా ఖమ్మం జిల్లాలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఓ డ్రామా లాంటి ధర్నా చేపట్టారు. మంత్రి తుమ్మల వచ్చి ఏదో హామీ ఇవ్వగానే జెండాలు దించేశారు. రైతు ఆత్మహత్య పట్ల తన వేదనను ప్రకటించిన హరీష్‌రావు మాటలు రైతులను రెచ్చగొట్టేలా ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు పోలీసుల దాకా వెళ్లాయి. రుణమాఫీ బూటకంపై ఎవరు నోరెత్తినా ఊరుకొనేది లేదన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

రాహుల్‌ని రప్పించి రైతు డిక్లరేషన్ వేదికపై వరంగల్‌లో 'రుణమాఫీ విజయయాత్ర' ఏర్పాటుచేస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఆ మాట ఎత్తడం లేదు. అరకొర మాఫీతో పాల్పి పట్ల రైతులు అసంతృప్తిగా ఉన్నారనే విషయం ఆయన దాకా వెళ్లి ఉండవచ్చు. మాఫీ కోసం కేటాయించిన రూ.31 వేల కోట్ల లెక్క తేల్చాలని విపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీస్తే రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉన్నది.

మాఫీ రూ.31 వేల కోట్లు చేశామని ఎందుకు ప్రచారం చేసుకుంటున్నారో స్పష్టత లేదు. బ్యాంకులు ఇచ్చిన వివరాల ప్రకారం అంత మొత్తం అవసరమవుతుందని చెప్పిన ప్రభుత్వం ఆ వివరాలను దాచిపెడుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీల ప్రకారం బ్యాంకులు అందించిన రైతుల పేర్లు, బకాయిలు బయటపెట్టాలి.



నివాళి

తెలంగాణ సాహితీ శిఖరం అయాచితం

గంగవరం
ఆంజనేయశర్మ
94404 62545

సాహితీ శిఖరం నేలకొరిగింది. ఒక గొప్ప సంస్కృతాంధ్ర కవి పండితుడిని సాహితీలోకం కోల్పోయింది. ప్రముఖ సాహిత్య పండితుడు, ధార్మిక, ఆధ్యాత్మికవేత్త, అవధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ అస్తమించడం ఆత్మీయ సాహిత్య లోకానికి తీరని లోటు. ప్రముఖ విద్వాంసులు జయలక్ష్మి-అనంత రాజయ్యశర్మల జ్యేష్ఠ పుత్రుడు డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ కామారెడ్డి సమీపంలోని రామారెడ్డిలో 1956 జూలై 17న జన్మించారు.

'అచటబుట్టిన చిగురుకొమ్మైన చేవయగు' అన్నట్లు అయాచితం వారింట్లో అయాచితమైన ప్రజ్ఞాపాటవాలు కలిగి అంచెలంచెలుగా అత్యున్నత సాహితీ శిఖరాలను అధిరోహించిన సంస్కృతాంధ్ర కవి పండితులు నటేశ్వరశర్మ. 1969లో సంస్కృత విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే సంస్కృతం, తెలుగులో పద్య, శ్లోక, గేయ రచనలను ఆయన ప్రారంభించారు. 1970లో కంచి పీఠాధిపతుల సమక్షంలో విద్యార్థిగా సంస్కృత శ్లోక స్వాగతాన్ని పలికిన ఆయన.. గొప్ప కవిగా కీర్తిప్రతిష్ఠలు అందుకుంటారని అప్పట్లోనే అభినందనలు పొందారు. అయాచితం అర్ధాంగి అరుణకుమారి కూడా పండిత కుటుంబానికి చెందినవారే.

కామారెడ్డిలోని ప్రాచ్య విద్యాపరిషత్తు సాయంప్రాచ్య కళాశాలలో ఆచార్యుడిగా మొదలైన ఆయన ప్రస్థానం ప్రధానాచార్యుల వరకు సాగింది. అంతేకాదు, ఓయూలో ప్రాచ్య భాషా పీఠాధిపతిగా కూడా ఆయన సేవలందించారు. 2014 జూలైలో పదవీ విరమణ పొందారు. వేలాది మంది విద్యార్థులకు సంస్కృతాంధ్ర భాషలను ఆయన బోధించారు. అంతేకాదు, కవిత్వంలో, అవధానాల్లో పట్టువచ్చేలా వారిని తీర్చిదిద్దారు. అయాచితం శిష్య, ప్రశిష్యులెందరో గొప్పగొప్ప అవధానులుగా, కవులుగా వారి అవధాన కవిత్వ కీర్తిని నిలబెడుతున్నారు.

డాక్టర్ నటేశ్వరశర్మ అనేకమంది పండితుల సాహచర్యంలో ఉభయ రాష్ట్రాల్లో ఉభయ భాషా పాండిత్యాల్లో గొప్ప కీర్తిని పొందారు. వందలాది అవధానాలు, సాహిత్య గోష్ఠులు, వేలాది పుస్తకాలకు పీఠికలు, వివిధ పత్రికల్లో అనేక వ్యాసాలు రచించి ఎనలేని కీర్తిని గడించారు.

ఆణిముత్యాల్లాంటి అయాచితం నటేశ్వరశర్మ దస్తూరి ముందు ముద్రణా యంత్రాలు కూడా దిగదుడుపే. గుండ్రని, చక్కని దస్తూరి వారిది. ఎన్నో పురస్కారాలతో పాటు అత్యున్నతమైన దాశరథి పురస్కారం కూడా ఆయనను వరించింది. 'శకుంతల' అనే పద్యకావ్యానికి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కావ్య పురస్కారం కూడా లభించింది. 'భారత ప్రశస్తి'కి జాతీయ సాహిత్య పరిషత్తు పురస్కారం పొందారు. 1994లో ఓయూ నుంచి డాక్టరేట్ పట్టా, స్వర్ణ పతకం కూడా పొందారు. ఇటీవల పరిశోధన రచన 'సౌందర్యలహరి సౌందర్యం' అనే గొప్ప కావ్యం ప్రముఖ పండితులు, ధార్మికుల చేతులమీదుగా ఆవిష్కృతమైంది.

సంస్కృతం, తెలుగులో 60కి పైగా గ్రంథాలను అయాచితం రచించారు. అంతేకాదు, తెలంగాణ సుప్రభాతం రూపకం రాశారు. శ్లోక పద్య వచన ప్రక్రియలో రచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కవిగా తన గొంతు విప్పారు. గతేడాది జూన్ 2న జరిగిన రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రసంగంలో నటేశ్వర శర్మ పద్య పాదాన్ని ఉటంకించడం విశేషం.

కామారెడ్డి బ్రాహ్మణ వికాస పరిషత్తుకు చాలా సంవత్సరాలు అధ్యక్ష, కార్యదర్శులుగా ఆయన ఎనలేని సేవలందించారు. అంతేకాదు, అనేక సాహిత్య అవధాన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే, సామాజిక సేవ చేసి ప్రజల్లో ఆత్మీయతను పొందారు. ఉన్నతమైన వ్యక్తిత్వం, విశాల హృదయం, కలుపుగోలుతనం, వినమ్రత ఇవన్నీ ఆయనకు చిరస్థాయి ఆభరణాలు. అనేక దిన, వార, పక్ష, మాస పత్రికల్లో ప్రచురితమయ్యే ఆయన వ్యాసాలు ఆటాలగోపాలాన్ని అలరించేవి.

డాక్టర్ అయాచితం మన ప్రాంతానికి అయాచితంగా లభించిన ఆణిముత్యం. వారి కీర్తి అజరామరం, అనంతం. వారి కీర్తి నగమేరు శిఖరమంత విస్తరించింది. ఇసన్నపల్లి భైరవస్వామి సుప్రభాతంతో పాటు అనేక దేవతల స్తోత్రాలు, శతకములు, అష్టకములు వారికి గొప్ప కీర్తినందించాయి. జంట అవధానాలు కూడా చేసిన అయాచితం నటేశ్వరశర్మ పూర్వ కవుల స్థాయికి చేరుకున్నారు. వారికి సదాసర్వదా మనం రుణపడి ఉన్నాం. వారి నిర్యాణం తెలంగాణ సాహితీ లోకానికే కాదు, తెలుగు సాహితీలోకానికి తీరని లోటు.

దారులు పూలతేరులయి

2023, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తావించిన డాక్టర్ ఆయాచితం నటేశ్వరశర్మ రాసిన పద్యం.

'దారులు పూలతేరులయి, తావులు నింపును నేత్రశోభలన్
తేరులవోలె రమ్యపథ దీపుల నింపుచు సాగిపోవగా
మారిన గ్రామశోభ, నవ మంజులతాళిని కుంజమై, మనో
హారిణి రాష్ట్ర శోభ జనహాస వికాస విలాసమయ్యెడిన్!'

మూడో ప్రత్యామ్నాయం ఎక్కడ?

భారత రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా వినిపిస్తున్న మాట కేంద్రంలో మూడో ప్రత్యామ్నాయం. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ఇతర వామపక్షాల మద్దతుతో కేంద్రంలో 2004 నుంచి 2008 వరకు కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ సర్కారు నడిచింది. కమ్యూనిస్టులు మద్దతు ఉపసంహరించుకున్న తర్వాత కూడా మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2014 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలయ్యేంత వరకు కొనసాగింది. వామపక్షాల మద్దతుతో కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యమున్న మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ ఏర్పాటుతోనే దేశంలో మూడో ప్రత్యామ్నాయానికి నూకలు చెల్లినట్టయింది.

మెరుగుమాల
నాంచారయ్య

ఢిల్లీలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల భాగస్వామ్యం లేని మూడో ప్రత్యామ్నాయ కూటమికి చెందిన చివరి ఇద్దరు ప్రధానులు ఎవరంటే.. హెచ్‌డీ దేవెగౌడ, ఐకే గుజ్రాల్ అని చెప్పకతప్పదు. కానీ, కాంగ్రెస్ బయటి నుంచి ఇచ్చిన మద్దతుతో దేవెగౌడ, గుజ్రాల్ నాయకత్వాన ఈ ప్రభుత్వాలు నడిచిన కారణంగా వాటిని అసలుసిసలు మూడో ప్రత్యామ్నాయాలుగా పరిగణించలేం. వరుసగా 2009, 2014, 2019, 2024లో జరిగిన ఎన్నికల ఫలితాలు ఇండియాలో మూడో ప్రత్యామ్నాయానికి అవకాశం లేదని నిరూపించాయి. కమ్యూనిస్టు పార్టీలు, ఉత్తరప్రదేశ్, బీహార్‌లో పూర్వపు పాలకపక్షాలు సమాజ్‌వాదీ, ఆర్జేడీలు పది, పదిహేనేండ్ల క్రితం వరకు దేశంలోని రెండు ప్రధాన జాతీయపక్షాలు బీజేపీ, కాంగ్రెస్‌కు సమాన దూరం పాటిస్తామనే వైఖరిని అవలంబించాయి. తర్వాత ఈ రెండు పెద్ద హిందీ రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తమ రాజకీయ పంథాకు స్వస్తి పలికాయి. రెండు చోట్లా ముఖ్యంగా యూపీలో బీజేపీ 2014 నుంచీ బలీయ శక్తిగా అవతరించడం, బీహార్‌లో బీజేపీ బలం క్రమేపీ పెరగడం దీనికి కారణం. వాస్తవానికి యాదవులు, కుర్మీలు, ఇతర వెనుకబడిన కులాలు, దళితులు, ముస్లిం మద్దతు మెండుగా ఉన్న ఎస్పీ, ఆర్జేడీలు ఈ రెండు రాష్ట్రాల్లో బ్రాహ్మణులు, ఇతర అగ్రవర్ణాల నేతృత్వంలోని కాంగ్రెస్‌ను ప్రస్తుత బలహీన స్థితికి నెట్టివేయడంలో కీలకపాత్ర పోషించాయి. యూపీలో అయితే బయటి నుంచి మద్దతు ఇచ్చినప్పుడు కూడా ఎస్పీ స్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ (1990ల చివర్లో) తన సంకీర్ణ సర్కారులోకి కాంగ్రెస్‌ను తీసుకోలేదు. మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు. చివరికి 2017 యూపీ అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్వల్ప సంఖ్యలో సీట్లిచ్చి, ఎస్పీ కలిసి పోటీచేసింది. ఇక బీహార్ విషయానికి వస్తే ఆర్జేడీ (ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ భార్య రబ్డీ దేవీ నాయకత్వంలో) చివరి దశ పాలనాకాలంలో కాంగ్రెస్ జూనియర్ భాగస్వామిగా చేరింది. మళ్లీ 2014 తర్వాత రెండుసార్లు జేడీయూ నేత నితీశ్ కుమార్ నాయకత్వాన సాగిన మహా ఘటబంధన్ సంకీర్ణ ప్రభుత్వాల్లో కూడా కాంగ్రెస్ చిన్నపాటి భాగస్వామి అయింది. కేంద్రంలో, అనేక ఉత్తరాది రాష్ట్రాల్లో పదేండ్లకు పైగా అధికారంలో పాతుకుపోయిన బీజేపీని గద్దె దింపాలంటే కాంగ్రెస్ కూటమిలో ఉండక తప్పదనే నిర్ణయానికి డీఎంకే వంటి దక్షిణాది పార్టీ సహా జనతా పరివార్ పార్టీలుగా పిలిచే ఎస్పీ, ఆర్జేడీ, ఇంకా కమ్యూనిస్టు పార్టీలు ఇప్పుడు వచ్చేశాయి. దీంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో ఎన్నికల్లో పొత్తు, అధికారం పంచుకునే పార్టీలు ఇప్పుడు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. కేరళలో వామపక్షాలు, తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్, ఒడిశాలో బీజేడీ వంటి కొన్ని పార్టీలే ఎన్డీయే, ఇండియా కూటములకు దూరంగా ఉన్నాయి.

దేశంలో, ముఖ్యంగా కేంద్రంలో ఏ ఒక్క పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాకుండా త్రిశంకు లోక్‌సభల ఏర్పాటుకు 1989, 1991, 1996, 1998, 1999, 2004, 2009 పార్లమెంట్ ఎన్నికలు దారితీశాయి. ఒక్క 1991 పార్లమెంటు మధ్యంతర ఎన్నిక తర్వాత మాత్రమే కాంగ్రెస్ ఇతర పార్టీలను చీల్చి, మైనారిటీ సర్కారును మెజారిటీ మద్దతు ఉన్న ఏక పార్టీ ప్రభుత్వంగా రెండున్నరేండ్లలో మార్చగలిగింది. నాటి ప్రధాని, కాంగ్రెస్ అధ్యక్షుడు పీవీ నరసింహారావు చాణక్యం, పాండిత్యం అందుకు దోహదం చేశాయి. అలా కాకుండా కేంద్రంలో పాలక కూటమికి నాయకత్వం వహించిన జనతాదళ్, బీజేపీలకు 1996-2004 మధ్య రెండొందల సీట్లు మాత్రమే లోక్‌సభలో ఉన్న కారణంగా రాజకీయ సుస్థిరత లేదనే చెప్పవచ్చు. ఈ కారణంగానేఅప్పట్లో మధ్య తరగతి పౌరులు.. 'దేశంలో రెండు ప్రధాన జాతీయపక్షాల్లో ఏదో ఒకదానికి పార్లమెంటు ఎన్నికల్లో సాధారణ మెజారిటీకి అవసరమైన 272 సీట్లు రావాలి. మన లాగా పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాలో పయనిస్తున్న బ్రిటన్, అధ్యక్ష తరహా పాలన ఉన్న అమెరికాలో మాదిరిగానే రెండు ప్రధాన ఆధిపత్య రాజకీయపక్షాలు మాత్రమే సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చే రాజకీయ వ్యవస్థ భారత్‌లోనూ వేళ్లూనుకోవాలి' అనే భావనతో ఉండేవారు. అయినా బీజేపీ, కాంగ్రెస్ మీద ఆధారపడకుండా మూడో ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి బలపడితేనే భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందనే వారి సంఖ్య కూడా గణనీయంగా ఉండేది. కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ ధోరణులను, ఇతర ప్రాంతీయపక్షాలను సహించని ఆధిపత్య ధోరణులను గట్టిగా వ్యతిరేకించే వామపక్షాలు సహా అనేక పక్షాలు 1967-1989 మధ్యకాలంలో హిందూ మతతత్వ భావజాలంతో ఉన్న జన్‌సంఘ్, బీజేపీ, శివసేన వంటి పక్షాలతో చేతులు కలపడానికి వెనుకాడలేదు. 2014 నుంచీ కేంద్రంలో, దేశంలోని నాలుగు వైపులా ఉన్న అనేక రాష్ట్రాల్లో బీజేపీ బలపడే క్రమంలో దేశంలో తృతీయ ప్రత్యామ్నాయం గురించి మాట్లాడే ఓపిక, ఆసక్తి వామపక్షాలు సహా అనేక బలమైన ప్రాంతీయపక్షాలకు లేకుండా పోయాయి.

యూపీఏ-2 హయాం మధ్యలో 2012లో వేగం పుంజుకున్న అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి మాజీ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వాన ఆదే ఏడాది నవంబర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అవతరించింది. వామపక్ష విధానాల వైపు మొగ్గుతో బయల్దేరిన ఆప్ ఆరంభం నుంచీ బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా మూడో ప్రత్యామ్నాయంగా కనిపించింది. ఏడాది తర్వాత 2013 చివర్లో జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో మొత్తం 70 సీట్లలో 26 స్థానాలు, 29.5 శాతం ఓట్లు సాధించి సంచలనం సృష్టించింది. 32 సీట్లు కైవసం చేసుకున్న బీజేపీని అధికారంలోకి రాకుండా నిలువరించడానికి ఆప్‌కు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంతో కేజ్రీవాల్ మొదటిసారి ఢిల్లీ సీఎం అయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల వల్ల కొద్ది నెలలకే కేజ్రీవాల్ సర్కార్ కూలిపోయాక ఎప్పటిలా రెండు జాతీయపక్షాలకు ఆప్ ప్రధాన ప్రత్యర్థిగా అవతరించే ప్రయత్నం చేసింది.

2014 పార్లమెంట్ ఎన్నికల్లో వారణాసి నుంచి కూడా నామినేషన్ వేసిన ప్రధాని నరేంద్రమోదీపై కేజ్రీవాల్ పోటీకి దిగి, కాంగ్రెస్, బీజేపీలకు తాను వ్యతిరేకమని నిరూపించారు. అయితే 2019 ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ పెంచుకోవడం, కేంద్ర సర్కారు ఆదేశాలకు అనుగుణంగా నడిచే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌తో గొడవల కారణంగా గత రెండేండ్లలో కాంగ్రెస్‌కు ఆప్ కాస్త దగ్గరైంది.

అయితే, 2022 పంజాబ్ ఎన్నికల్లో నాటి పాలకపక్షం కాంగ్రెస్, అకాలీదళ్, బీజేపీ కూటములను ఓడించి మూడో ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందనే భావన కలిగించింది. కానీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని మూడో ప్రత్యామ్నాయంగా ఎదగాలనే కాంక్షకు నెమ్మదిగా తెరదించింది.

2024 బ్రిటిష్ పార్లమెంటు ఎన్నికల్లో 33 శాతం ఓట్లు మాత్రమే దక్కించుకున్న లేబర్ పార్టీ మంచి మెజారిటీ (మొత్తం 650కి 411 సీట్లు) సాధించింది. పూర్వపు అధికారపక్షం కన్జర్వేటివ్ పార్టీ 23.7 శాతం ఓట్లతో కేవలం 121 సీట్లే గెల్చుకుంది. కొత్తగా రంగంలోకి దిగి 600కు పైగా సీట్లలో పోటీచేసిన మితవాద రిఫామ్ పార్టీ (పాత బ్రెగ్జిట్ పార్టీ) గెలిచింది 6 సీట్లే అయినా 14.3 శాతం ఓట్లు కైవసం చేసుకుంది. అంతేకాదు, ఇటీవల వివిధ రాజకీయపక్షాల పనితీరుపై జరిగిన ఒక సర్వేలో రిఫామ్ పార్టీ బాగా పుంజుకుంటున్నట్టు తేలింది. నిండా ఏడు కోట్ల జనాభా లేని ఇంగ్లండ్‌లోనే నూరేండ్లకు పైగా కొనసాగుతున్న రెండు ఆధిపత్య రాజకీయపక్షాల (లేబర్, కన్జర్వేటివ్) పాలనకు స్వస్తి పలికి మూడో ప్రత్యామ్నాయానికి అవకాశం ఇవ్వాలనే అభిప్రాయం జనంలో బలపడుతోంది. ఈ నేపథ్యంలో దాదాపు నూరు కోట్ల మంది ఓటర్లు, ఏడెనిమిది మతాలు, వేలాది సామాజికవర్గాలు ఉన్న సువిశాల భారతదేశంలో కేవలం రెండు జాతీయ రాజకీయపక్షాలే ఒకదాని తర్వాత ఒకటి